# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రంలో ఆర్థిక నేరాలను కట్టడి చేసే విషయంలో మరింత చురుకుగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**2. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో 29 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు.**

**4. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

==========================

రాష్ట్రంలో ఆర్థిక నేరాలను కట్టడి చేసే విషయంలో మరింత చురుకుగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన నిన్న శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల అరికట్టడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సాంకేతికత, సీసీ కెమెరాలు, ఇంటెలిజెన్స్, పహారా వంటి చర్యలతో పోలీసులు ప్రత్యక్షంగా లేకపోయినా వారి ప్రభావం కనిపించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్…30 సెకన్లు

--------------------------

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి, ఎఐ శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాదులోని సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్య అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిభ కలిగిన మైనార్టీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇమామ్ లు, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతనం క్రమం తప్పకుండా విడుదల చేయాలన్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల క్యాలెండర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన నిన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, శంకుస్థాపనల గడువులను వెల్లడించారు. ఈ ఏడాది జూన్ లో దవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఏర్పాటు పనులకు, జూలైలో గుంటూరు కాలువ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నవంబరులో నేరడి బ్యారేజ్, వచ్చే ఏడాది జనవరిలో మద్దువలస రెండవ దశ పనులకు శంఖుస్థాపన, జూన్ లో పోలవరం ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు పేర్కొన్నారు. సాగునీటి రంగంపై ప్రభుత్వ నిబద్ధతను చాటేలా మొత్తం 25 ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పూర్తి తేదీలు, శంకుస్థాపనల సమయాలను ఖరారు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

----------------------------

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో 29 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు. ఈ ఉదయం తాడేపల్లి నుంచి ద్వారకా తిరుమల చేరుకుని, స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 12 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్ ను ప్రారంభిస్తారు. అదేవిధంగా మరో 12 కోట్ల రూపాయలతో నిర్మించిన మండపాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కొండపై ఉన్న శివాలయంలో 4 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన 5 అంతస్తుల రాజగోపురాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు ద్వారకా తిరుమల నుండి విజయవాడకు చేరుకుంటారు.

----------------------------

రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. టెండర్ ద్వారా ఎంపికైన ప్రైవేట్ సంస్థలు వచ్చే మూడు నెలల్లో వీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 61 డయాలసిస్ కేంద్రాలు ఉండగా, కొత్త కేంద్రాలతో ఈ సంఖ్య 73కు చేరనుందని తెలిపారు. భీమవరం, పీలేరు, జమ్మలమడుగు, వెంకటగిరి, అద్దంకి, సున్నిపెంట, రైల్వేకోడూరు, కొండేపి, కోవూరు, మైదుకూరు, నందిగామ, వినుకొండ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో కేంద్రంలో ఐదు డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేసి సుమారు 1,500 మంది రోగులకు ఉచిత సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

----------------------------

వెనకబడిన తరగతుల అభ్యున్నతికి విద్యే కీలకమైన అంశమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన నిన్న మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులను ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యపై దృష్టి పెడితే వచ్చే తరానికి పురోగతి వస్తుందన్నారు. ఐఐటి, ఐఐఎం, ఎన్ఐటి వంటి సంస్థల్లో రాష్ట్రానికి చెందిన 500 మంది ఎంపిక కావాలనే లక్ష్యంతో పని చేయాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

----------------------------

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమయానికి

అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026–27 సంవత్సరానికి 294 కోట్ల రూపాయలతో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్‌కు అవసరమైన 93 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను 50 శాతం రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ఈ ఏడాది 2 లక్షల 20 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం రాయితీపై ఈ నెల 20 నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే లక్షా 62 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను ఈ నెల 15 నుంచి రైతులకు అందించనున్నట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

--------------------------

మైనారిటీల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమంలో భాగంగా 287 కోట్ల రూపాయలతో మౌలిక వసతుల పనులు చేపట్టామని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఈ పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన నిన్న మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెయ్యి కోట్ల రూపాయల విలువైన కొత్త ప్రతిపాదనలు కేంద్రానికి పంపనున్నట్టు వెల్లడించారు. ఇమామ్‌లు, మౌజన్లు, పాస్టర్లకు గౌరవ వేతనాలు, హజ్ యాత్రికులకు ఆర్థిక సహాయం, మసీదుల నిర్వహణ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని శ్రీధర్ తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. కొమొరిన్ ప్రాంతం నుండి, విదర్భ, మరాఠ్వాడ, అంతర కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా నైరుతి మధ్యప్రదేశ్ వరకు ద్రోణి విస్తరించి ఉన్నదని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి నారాయణ పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================